క్లుప్తంగా

శ్రీ గంగానమ్మ అమ్మవారికి సారె



గుడివాడ టౌన్: మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) త్వరలో కోలుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యంతో పట్టణానికి విచ్చేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక పెద ఎరికపాడులోని శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి కొడాలి నాని అభిమానులు వన్నెంరెడ్డి దినేష్, అడపా హర్షల ఆధ్వర్యంలో సారె సమర్పించి, 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భగవంతుని దీవెనలు, గుడివాడ ప్రజల ఆశీస్సులు కొడాలి నానీకి ఎళ్లవేళలా ఉంటాయన్నారు. కొడాలి నాని సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజా జీవితంలోకి వస్తారని ఆకాంక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, నాయకులు పాలేటి చంటి, కె. ఆంజనేయ ప్రసాదు, అద్దేపల్లి పురుషోత్తం, అడపా పండు, సింహాద్రి రాంబాబు, బి.మురళి, ఎం.ఉదయ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

తోట్లవల్లూరు: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రోటరీక్లబ్ ఆఫ్ ఉయ్యూరు అధ్యక్షుడు చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. రోటరీక్లబ్, రిజువాన్ మెడికేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో తోట్లవల్లూరులో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం జరిగింది. 120 మంది రోగులకు వైద్య బృందం ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేసింది. బీపీ, షుగర్, గుండెకు సంబంధించి ఈసీజీ, ఎకో పరీక్షలను నిర్వహించారు. కేసీపీ డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ రామకోటిరెడ్డి, రిజువాన్ ప్రతినిధి బాలాజీ లంక, కేసీపీ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయ మండపానికి శంకుస్థాపన

తోట్లవల్లూరు: యాకమూరులో శ్రీకోదండ రామాలయ మండపానికి శుక్రవారం గ్రామస్తులు శంకుస్థాపన చేశారు. రూ.12 లక్షల వ్యయంతో మండపం నిర్మాణం జరగనుంది. కార్యక్రమంలో సర్పంచ్ గాదె కనకదుర్గ, మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ప్రతినిధి కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయభాస్కరమ్మ దంపతులు, సుధీర్ టింబర్‌డిపో అధినేత నూకల సాంబశివరావు, నేత్ర వైద్యుడు వెలివెల వెంకట రాజేష్‌కుమార్, రోటరీక్లబ్ అధ్యక్షుడు చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



పామర్రు: అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖలో కాలువ గట్లపై ఉన్న ఆక్రమణలను సత్వరమే తొలగింపు చర్యలు చేపట్టాలన్నారు. నాగులేరు కాలువ గట్టపై ఉన్న లస్కర్ క్వార్టర్స్‌లు ఆక్రమణలకు గురయ్యాయని, ఈ విషయమై సంబంధిత అధికారులు తగు విధమైన చర్యలు తీసుకుని ఆక్రమణదారుల నుంచి ఇరిగేషన్ భూమిని కాపాడాలని ఆదేశించారు. నియోజకవర్గంలోని డ్రెయినేజీ వ్యవస్థను పూర్తి స్థాయిలో అభివృద్ధి పర్చాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, స్థానిక డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్యాంపస్ ఎంపికలో 14 మందికి ఉద్యోగాలు



గుడివాడ టౌన్: స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాల్లో శుక్రవారం శ్రీచైతన్య ఈ–టెక్నో స్కూల్ నిర్వహించిన క్యాంపస్ ఎంపికలో 14 మందికి ఉద్యోగ అవకాశాలు లభించినట్లు ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ తెలిపారు. ఈ ఎంపికలో మొత్తం 30 మంది ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్థులు పాల్గొనగా 14 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, ఎంఎస్సీ విభాగాధిపతి కె. సుభాషిణి, శ్రీ చైతన్య ఈ–టెక్నో ప్రతినిధి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలి

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదపాలపర్రు హైస్కూల్లో ప్రవేశాలకు ఉపాధ్యాయులు శుక్రవారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. స్థానిక హైస్కూల్‌కే విద్యార్థులను పంపేందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరుతూ హెచ్ఎం పాండురంగారావు, ఉపాధ్యాయులు రాజశేఖర్ కరపత్రాలు పంపిణీ చేశారు.

అంగన్‌వాడీ భవనాలను ప్రారంభించేదెప్పుడో?



పామర్రులో నిలిచిపోయిన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు

పామర్రు: అంగన్‌వాడీ భవనాల ఆధునికీకరణలో భాగంగా మండలంలో నూతన భవనాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభించారు. అయితే పనులను పూర్తి చేయకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా నిర్మించే అంగన్‌వాడీ భవనాలను ఎప్పుడు ప్రారంభిస్తారా అని చిన్నారుల తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. మండలంలోని 55 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో సుమారు 2,100 మంది చిన్నారులు ఉన్నారు. వీరిలో మూడు సంవత్సరాల చిన్నారులు 1450 మంది ఉండగా 0–3 ఏళ్ల చిన్నారులు 650 వరకు ఉన్నారు.

తొమ్మిది భవనాలకు రూ.64.5 లక్షలు

మండలంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో అద్దె భవనాల్లో తొమ్మిది కేంద్రాలను నిర్వహిస్తున్నారు. వీటి స్థానంలో కొత్త వాటిని నిర్మించాలనే ఉద్దేశంతో తొమ్మిది అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు రూ. 64.50 లక్షలు మంజూరు చేశారు. వీటి నిర్మాణం పనులు కొంత కాలంగా నిలిచిపోయాయి. దీంతో ఆయా అంగన్‌వాడీ కేంద్రాలు ఇరుకు, అద్దె గదుల్లోనే నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇంత వరకు ఈ భవన నిర్మాణాలపై అధికారులు దృష్టి సారించకపోవడం దురదృష్టకరమని చిన్నారుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

పనులు నిలిచిన భవనాలు..

పామర్రు గ్రామంలోని బాలికల పాఠశాల–1, చెన్నువానిపురంలో –1, పెదమద్దాలి ఎస్సీ కాలనీలో–1, పెదమద్దాలి శివారు కొండాయపాలెంలో–1, రిమ్మనపూడిలో –1, జుఝవరం ఎస్సీ కాలనీలో –1, గ్రామంలో–1, కనుమూరులో–1, నిమ్మకూరులో– 1 మొత్తం తొమ్మిది భవనాల పనులు నిలిచి పోయి ఉన్నాయి.

అద్దె భవనాలతో ఇబ్బందులు

అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహించడం ఇబ్బందికరంగా ఉంటోందని అంగన్‌వాడీ నిర్వాహకులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇచ్చే అద్దెకు తాము కూడా కొంత నగదు జమ చేసి అద్దె భవనాల్లో ఉంటున్నట్లు తెలిపారు. చిన్నారులతో ఇబ్బందిగా ఉంటోందని, శుభ్రంగా ఉండరంటూ ఖాళీ చేయమంటూ కొందరు ఇంటి యజమానులు ఒత్తిడి తెస్తున్నారు. దీంతో అద్దె ఇళ్లు దొరక్క నిర్వాహకులు కొందరు అవస్థలు పడుతున్నారు.

చిన్నారుల ఇబ్బందులు

మండలంలో నిర్మాణంలో ఉన్న తొమ్మిది అంగన్‌వాడీ కేంద్రాలను ఎప్పుడు ప్రారంభిస్తారని చిన్నారుల తల్లులు ప్రశ్నిస్తున్నారు. అద్దె భవనాలు ఇరుకుగా ఉండటం కారణంగా చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవన నిర్మాణాలు పూర్తయితే చిన్నారుల విద్యాబోధన, ఆటలు ఆడుకునేందుకు బావుంటుందని ఉంటుందని అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిలిచిపోయిన భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

భవనాలను పూర్తి చేయాలి



అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్ర భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలి. అద్దె గదులు, ఇరుకు గదుల్లో చిన్నారులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భవన నిర్మాణాలను పూర్తి చేయాలి.

– కె.రాణి, బల్లిపర్రు

త్వరలో పూర్తి చేస్తాం



నిలిచిపోయిన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ప్రస్తుతం నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేస్తాం.

– వీ భానుశ్రీ, సీడీపీఓ, పామర్రు ప్రాజెక్టు

పూలే ఆశయ సాధనకు కృషి



పామర్రులో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: విద్యను అన్ని వర్గాల ప్రజలకు అందించాలని పాటు పడిన మహనీయుడు జ్యోతిరావు పూలే ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పూలే జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది విద్య ఒక్కటే అన్నారు. అందరికీ విద్య అందేలా కృషి చేసిన మహనీయుడు పూలే అన్నారు. మహిళలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉండాలని తెలిపిన తొలి వ్యక్తి పూలే అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ , వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు,పీ రత్నకుమారి, కె నాగ మల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, రాజు, సురేష్‌రెడ్డి, రాణి, వెంకటరెడ్డి, సింహాచలం, శ్రీహరి పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, కార్యదర్శి రమణ, కందిమళ్ల సుబ్రమణ్యం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మహాత్మా జ్యోతీరావు పూలే ఆనాటి కాలంలో సామాజిక అసమానతనలను రూపుమాపారని ఎంపీడీఓ టి.విజయసారథి అన్నారు. శుక్రవారం పూలే జయంతి సందర్భంగా గుడ్లవల్లేరు పంచాయతీ కార్యాలయంలో పూలే చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జె.నరసింహారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.



కైకలూరులో జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరులో..

కైకలూరు: సమాజంలో అణగారిన వర్గాలకు ఆశాజ్యోతిగా మహాత్మా జ్యోతిరావు పూలే నిలిచారని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. పూలే జయంతి సందర్భంగా కోరుకొల్లు రోడ్‌లో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధారణకు పూలే కృషి చేశారన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: సమసమాజ నిర్మాణంలో మహాత్మా జ్యోతిరావు పూలే కీలకపాత్ర పోషించారని బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శాంతరాజు అన్నారు. స్థానిక సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం పూలే జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్ఎస్ భాస్కరరావు, గోరింక గాంధీ, కొండపల్లి నాంచారయ్య, చేబోయిన వెంకటేశ్వరరావు, కట్టా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ విజయసారథి



మండవల్లిలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గుడివాడలో..

గుడివాడ టౌన్: మహాత్మ జ్యోతీరావ్ పూలే జయంతి శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహాలకు బీసీ చైతన్య సంక్షేమ సంఘం నాయకులు నివాళులర్పించారు. బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అగస్తి ఆదివిష్ణు, ప్రధాన కార్యదర్శి రావులకొల్లు వెంకట మల్లేశ్వరరావు, వై. గోవర్ధన్, ఎం. శ్రీనివాస్, సీహెచ్ సత్యనారాయణ, కేఎస్ రాజ, డాక్టర్ బండారు శ్యాంకుమార్, పి. దుర్గాప్రసాద్, ఎంఆర్ మోహన్‌రావు, బ్రహ్మాజి, పి. జయరాజు, వి. సైమన్ పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: ప్రముఖ సంఘసంస్కర్త జ్యోతిరావుపూలే నేటి తరానికి ఆదర్శప్రాయుడని ముదినేపల్లి సర్పంచ్ నిమ్మగడ్డ కై కమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు నిమ్మగడ్డ భిక్ష అన్నారు. స్థానిక బస్టాండ్ ఎదురుగా పూలే విగ్రహం వద్ద జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పుణ్యేశ్వరరావు, వరప్రసాద్, వీర వెంకటేశ్వరరావు, వాసు, గౌస్‌బేగ్, రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదగొన్నూరు శివారు ఉప్పరగూడెంలో ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం అవగాహన కల్పించారు. స్థానిక విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ముదినేపల్లి, మండవల్లి మండలాల ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జిలు గౌతమ్‌కుమార్, నాగవిజయ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి

మండవల్లి: మండలంలోని లింగాలలో శతాధిక వృద్ధుడు శుక్రవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన చిట్టూరి రత్తయ్య (102) వృద్ధాప్య కారణంగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రత్తయ్యకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉండగా భార్య మంగమ్మ గతంలోనే మృతి చెందింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: విద్యుత్ సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పట్టణ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏలూరు రోడ్, గాంధీబొమ్మ సెంటర్, హోమియో కళాశాల వెనుక వైపు, జీవీఆర్ వీధి, పాత ఇండేన్ గ్యాస్ వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి, సింగరాయపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ముదినేపల్లి సెక్షన్ ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు.

కైకలూరులో..

కైకలూరు: విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్‌శాఖ గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. కైకలూరు సబ్‌స్టేషన్, కలిదిండి మండలం పోతుమర్రు, కలిదిండి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

వడ్డీ రాయితీ గడువు పొడిగింపు

గుడివాడ టౌన్: పురపాలక సంఘ పరిధిలో ఆస్తి, కుళాయి, ఖాళీ స్థలాల పన్ను బకాయిలకు సంబంధించి వడ్డి రాయితీ గడువు పొడిగించినట్లు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరానికి సంబంధించిన పన్ను బకాయి వడ్డీలో 50 శాతం రాయితీ ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించామని పేర్కొన్నారు. ఆదివారం, సెలవు దినాల్లోకూడా ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు మున్సిపల్ కార్యాలయంలో పన్ను చెల్లించుటకు ప్రత్యేక కౌంటర్‌లు పనిచేస్తాయని తెలిపారు.

6న జాతీయ స్థాయి డ్యాన్స్ పోటీలు

గుడివాడ టౌన్: శివజ్యోతి నృత్యాలయం మూడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ స్థాయి డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు నృత్యకారిణి బత్తిన సరితా నెహ్రూ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 6వ తేదీ స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. కూచిపూడి, భరతనాట్యం, ఫోక్ డాన్స్, సోలో, గ్రూప్ డాన్స్‌లు మూడు కేటగిరిలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు ఈనెల 25వ తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 99633 55324లో సంప్రదించాలని కోరారు.

గర్భిణులకు పౌష్టికాహారం అవసరం

గుడివాడ టౌన్: పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతంగా ఉండాలంటే తల్లులు సరైన పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఎ.విజయాఫ్లారెన్స్ అన్నారు. శుక్రవారం స్థానిక 14వ వార్డు లోని పాముల కాలనీ, పంచవటి కాలనీలకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని మహిళలకు పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సూపర్‌వైజర్లు బీకేడీ భవాని, జయంతి పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయండి

పామర్రు: వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని బీసీ సంఘ మైనారిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మహమ్మద్ ఇబ్రహీం(ఆసీఫ్ పాషా) కేంద్రాన్ని డిమాండ్ చేశారు. వక్ఫ్ బిల్లును రద్దు చేయాలని కోరుతూ విజయవాడ–మచిలీపట్నం వరకు చేస్తున్న పాదయాత్ర శుక్రవారం పామర్రుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక ముస్లింలు, బీసీలు ఎస్సీలు, ఎస్టీలు, క్రిస్టియన్ సంఘాల వారు పాదయాత్రకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆసీఫ్ పాషా మాట్లాడుతూ ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తమ ఆలోచనా విధానాన్ని మార్చుకుని వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అక్కడి నుంచి మచిలీపట్నానికి పాదయాత్ర నిర్వహించారు.

ఘనంగా వీరమ్మ తల్లి సంబరాలు

గుడ్లవల్లేరు: దేళ్ల చరిత్ర కలిగిన మామిడికోళ్ల శ్రీ వీరమ్మ తల్లి సంబరాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు హైదరాబాదు, విజయవాడ, వైజాగ్, నాగాయలంక, ఏలూరు, కై కలూరు, భీమవరం, జిల్లాలో నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. అమ్మవారిని ప్రతిష్టించిన తోట దేవుడి భద్రయ్యను కూడా ఇక్కడి ఆరాధ్య దైవంగా కొలుస్తారు. అమ్మవారి వద్ద మొక్కులు తీర్చుకునేందుకు మహిళలు పాలు పొంగళ్లను అమ్మవారికి సమర్పించారు. సంబరాల ఏర్పాట్లను కమిటీ వారితో పాటు ఆలయ నిర్వాహకుడు మండా రాంబాబు పర్యవేక్షించారు. ఈ సంబరాల సందర్భంగా నిర్వహించే పోతురాజు విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

భాషాపండితుల పోస్టులు భర్తీ చేయండి

గుడివాడ టౌన్: గుడివాడ పురపాలక సంఘ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సంస్కృత ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని సంస్కృత భాషా వేదిక నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఈఓ బాలాజీకి వినతిపత్రాలు సమర్పించారు. వేదిక సభ్యులు మాట్లాడుతూ సంస్కృత ఉపాధ్యాయులు లేని కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. వేదిక సభ్యులు ఎర్రపోతు అర్జున్, కె. కిరణ్, కేకేడీ ప్రసాద్, పి.మురళి, కె.స్టాలిన్, శ్రీనివాస్‌శర్మ, వి. ఆత్మలింగం, కె.మోహన్ పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్ ఆశీస్సులు పొందిన హారిక దంపతులు



రాము, హారిక దంపతులను ఆశీర్వదిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పెడన: వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము, హారిక దంపతులను మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశీర్వదించారు. కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక జన్మదినాన్ని పురస్కరించుకుని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో రాము, హారిక దంపతులు జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తొలుత జ్యోతీరావు పూలే చిత్రపటానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు పూలుజల్లి నివాళులర్పించారు. అనంతరం హారిక జన్మదినాన్ని పురస్కరించుకుని రాము దంపతులు జగన్‌మోహన్‌రెడ్డి నుంచి ఆశీస్సులు పొందారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడండి



గుడివాడలో ఆర్డీఓ కార్యాలయ డీటీకి వినతిపత్రం అందజేసిన విలేకరులు

గుడివాడ టౌన్: ప్రజాస్వామ్యంలో ఫోర్త్ పిల్లర్‌గా వ్యవహరిస్తున్న పత్రికా స్వేచ్ఛను కాపాడాలని విలేకరుల సంఘాల నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి ఆర్డీఓ కార్యాలయ డీటీ బాలాజీకి వినతి పత్రాన్ని సమర్పించారు. సాక్షి ఎడిటర్ ఆర్. ధనుంజయరెడ్డి, మరో ఆరుగురిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తోందన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేసే ప్రక్రియలో అవి వారికి చేరకుండా నిలువరించేందుకు కేసులు బనాయించి, అణచి వేయాలని కోరుకోవడం దారుణమన్నారు. వెంటనే ధనుంజయరెడ్డి, ఇతరులపై పెట్టిన కేసులను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పి.ఆర్. కుమార్, జి. మణికంఠ, ఎన్.ఎస్.నాగరాజు, పి.సాయికుమార్, ఎన్.పండుబాబు, వి. బుజ్జిబాబు, రాంబాబు, డి.ఉపేంద్ర, ఎస్కే ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా వైఎస్సార్ సీపీ



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: ఆపదలో ఉన్న వారికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని పామర్రు మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని గరికపర్రులో వైఎస్సార్ సీపీ నాయకుడు, పంచాయతీ వార్డు సభ్యుడు వీరంకి కృష్ణారావు తండ్రి ఆంజనేయులు గురువారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని అనిల్‌కుమార్ శుక్రవారం సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కృష్ణారావును పరామర్శించారు. గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, బీవీఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత వెంకటరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, నాయకులు రాజేంద్ర, గవాస్కర్‌రాజు, రూబెన్, శశి, రాము పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

పామర్రు: తాము అధికారంలోకి వస్తే వెంటనే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని కూటమి నాయకుల హామీని అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలరావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి భవన నిర్మాణ కార్మికుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయడానికి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. టీడీపీ, జనసేన నాయకులు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఈ విషయాలపై ఈనెల 24వ తేదీన మచిలీపట్నంలోని కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు బడే కేశవరావు, రామ్మోహన్‌రావు, విల్సన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించాలి



పామర్రు కూడలి వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పామర్రు: గ్యాస్ సిలిండర్‌పై పెంచిన రూ.50 ధరను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక కూడలి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు గంగాధర్ మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ధరలు అదుపు చేస్తామని చెప్పిన హామీలను తుంగలో తొక్కి గ్యాస్, డీజిల్ పెట్రోల్ ధరలను పెంచడానికి సన్నద్ధమైందన్నారు. నాయకుడు భీమేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ పాలనలో ప్రజల హక్కులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. నాయకులు విల్సన్, పెదబాబు, కేశవరావు, రామ్మోహన్‌రావు, వెంకటేశ్వరరావు, బాబూరావు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తాం

పామర్రు: పొలంలో నాటడం నుంచి విత్తనం వరకు నిర్దేశించిన సాగు సూత్రాలు పాటిస్తేనే ఇండి–గ్యాప్ పొలం బడి రైతులకు ధ్రువీకరణ పత్రం మంజూరు చేస్తామని ఆంధ్రప్రదేశ్ సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ కృష్ణా జిల్లా ప్రాజెక్టు ఇన్‌స్పెక్టర్ మహ్మద్ షరీఫ్ అహ్మద్ తెలిపారు. మండలంలోని కొండిపర్రు గ్రామంలోని 'కొండిపర్రు ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్' తరఫున 16 మంది రైతులు రబీలో మినుము సాగు చేశారు. ఈ నేపథ్యంలో 267 ప్యారామేటర్స్‌గా మందులు, ఇతర అవశేషాలను పరీక్ష నిమిత్తం బెంగళూరు ల్యాబ్‌కి పంపడానికి శ్యాంపిల్స్ సేకరణ చేసి శుక్రవారం పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తే వారికి ఒక్క సంవత్సరం వ్యాలిడిటీ గల ఇండి–గ్యాప్ పొలం బడి ధ్రువీకరణ పత్రం మంజూరు చేస్తామన్నారు. రైతులకు ఆరోగ్యం, ఆదాయం రెండూ చేకూర్చే మార్గం ఇదేనన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఏడీఏ స్వర్ణలత, టెక్నికల్ ఏఓ శ్రీదేవి, పామర్రు, గుడ్లవల్లేరు, తోట్లవల్లూరు ఏఓలు శివనాగరాణి, సునీల్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రీసర్వేకు రైతులు సహకరించండి

పమిడిముక్కల: రీసర్వేకు రైతులు సహకరించాలని ఉయ్యూరు ఆర్డీఓ హెలెన్ షారోన్ కోరారు. మండలంలోని లంకపల్లి గ్రామంలో శుక్రవారం రీసర్వే ప్రాజెక్ట్‌పై జరిగిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. లంకపల్లిలంకలోని లంకపల్లి, శ్రీకాకుళం, సుగ్గల్లంక, చింతల్లంక పరిధిలోని 786 ఎకరాల్లో రీసర్వే జరుగుతుందన్నారు. సాంకేతిక, ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా రికార్డులను ఆధునికీకరిస్తూ, ప్రతి భూ యజమానికి న్యాయం చేయడం కోసం రీసర్వే కొనసాగుతుందన్నారు. రైతులు సర్వేకు హాజరై భూమి హద్దుల సమాచారం తెలుసుకోవాలని తెలిపారు. రీసర్వే అంటే ఏమిటి, ఎలా చేస్తారు, తేడాలు ఎలా వస్తాయి, వాటిని పరిష్కరించడానికి చట్టపరంగా ఉన్న పద్ధతులను తహసీల్దార్ నవీన్‌కుమార్ రైతులకు వివరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీను, రీసర్వే డీటీ యేసుపాదం, డీఐఓ శివరామకృష్ణప్రసాద్, మండల సర్వేయర్ సుధీర్‌కుమార్, వీఆర్వో వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

కై కలూరు: పోషకాహారంతో తల్లీబిడ్డల ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.కృష్ణకుమారి చెప్పారు. పోషకాహార అవగాహన సదస్సుల్లో భాగంగా కై కలూరు 6,7 వార్డుల అంగన్‌వాడీ సెంటర్లలో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్. సుగుణ, ఎన్.కవితాలక్ష్మి పాల్గొన్నారు.